# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [8]

~ అద్దంకి అనంత రామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [8]

**రచన:** అద్దంకి అనంత రామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** ఫిబ్రవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=1802

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [8]

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". దీన్ని వారం వారం సీరియలైజ్ చేస్తున్నాం.* ***ఇది ఎనిమిదవ భాగం.***

దీని ముందుభాగం

ఒక రోజు ఉదయాన్నే నిషా, అజయ్ కి ఫోను చేసింది. "ఎక్కడున్నావ్?" అని అడిగింది. "ఆన్ లైన్ లో ఉన్నా" అని చమత్కరించాడు అజయ్. "ఒకసారి నీతో ముఖ్యమైన విషయం మాట్లాడాలి", "చెప్పు", "ఫోనులో కాదు నేరుగా మాట్లాడాలి" అని నిషా అనటంతో, ఇద్దరూ హైటెక్ సిటీలో గల ఇనార్బిట్ మాల్ లో కలుసుకోవాలి అనుకున్నారు.

ఆర్థిక మాంద్యం కావటంతో కొనేవాళ్ళకన్నా, చూసిపోయే వాళ్ళే ఎక్కువ శాతం ఉన్నారు. చెరొక పిజ్జా తీసుకొని ఎదురెదురుగా కూర్చొని ఉన్నారు. హైదరాబాదు మొత్తం మీద అంతకన్నా అందమైన ప్రదేశం లేదని అజయ్ కి ఉన్న బలమైన నమ్మకం. అక్కడున్న అమ్మాయిలను చూసి, ముఖ్యంగా పొట్టి పొట్టి బట్టలేసుకుని, నున్నటి శరీరం గల్ల అమ్మాయిలని చూసి అజయ్ మనస్సు విసిరేసుకునేవాడు. కానీ ఇప్పుడు తాను ఉన్న పరిస్థితుల్లో అవేమీ పట్టించుకో లేదు.

"నీ ఉద్యోగ ప్రయత్నం ఎక్కడి దాకా వచ్చింది?" అడిగింది నిషా. "ప్రయత్నిస్తున్నాను, చాలా కష్టంగా ఉంది, చూస్తున్నావుగా నువ్వు కూడా! ఏంటో చెప్పాలన్నావు? కొంపతీసి నిన్ను కూడా తీసేశారా?" అని అడిగాడు వెటకారంగా.

"మా నాన్న నాకు ఒక పెళ్లి సంబందం తీసుకు వచ్చాడు. చేసుకోమని బలవంతం చేస్తున్నాడు" అని చెప్పింది. "అయితే చేసుకో అన్నాడు", అజయ్ కోపంగా. "ఏంటి అంత తేలికగా మాట్లాడతావు?" అన్నది. "మరి ఏమి చేయమంటావు? మీ నాన్నకేమో నాతో పెళ్లి ఇష్టం లేదు. పోనీ మనం చేసుకుందాం అంటే నువ్వు వినవు. ఇంతకన్నా నన్ను ఏమి చేయమంటావు?" అన్నాడు, అసహనంతో.

"పోయి ఎలా పెళ్లి చేసుకుంటాము? నీకు అస్సలే ఉద్యోగం లేక తిరుగుతున్నావు", అనటంతో అజయ్ కోపం ఒక్కసారిగా వచ్చేసింది. "ఇప్పుడు ఉద్యోగం లేకపోతే రాదా? మొన్నటి దాకా చేసింది అదే కదా?" అంటూ కోపంతో ఊగిపోయాడు. "అయినా నేను పెళ్లి గురించి మాట్లాడుతుంటే, నువ్వు ఉద్యోగం గురించి మాట్లాడతావే? ఉద్యోగం ఇవాళ కాకపోతే, రేపు వస్తుంది. పెళ్లి అనేది జీవితానికి ఒకసారే వస్తుంది" అన్నాడు. "అయితే వచ్చి మా నాన్నని ఒప్పించు. వాళ్ళను కాదని, ఇంట్లో నుంచి బయటకు రాలేను" అన్నది.

"రాకు, మీ నాన్న చూపించిన వాడినే చేసుకొని చావు, నా చావు నేను చస్తాను", అంటూ విసురుగా లేచి అక్కడి నుంచి వెళ్ళిపోయాడు. నిషా అజయ్ ని అనుసరించింది. బయటకు వచ్చి మాట్లాడకుండా ఇద్దరూ కాస్త దూరం నడిచారు. చివరికి ఒక చెట్టు దగ్గర ఆగి సిగిరెట్టు వెలిగించి నిలబడ్డాడు అజయ్.

"మాట్లాడుతుంటే అలా లేచి వస్తే ఏంటి అర్థం?" అన్నది నిషా. "ఏమిటి నీతో, మీ నాన్నతో ఇంకా మాట్లాడేది? ఆఖరి సారి అడుగుతున్నా, మీ నాన్న ఎలాగూ పెళ్ళికి ఒప్పుకోడు, నాతో వచ్చేయి, పెళ్లి చేసుకుందాం. ఉద్యోగం అంటావా అదే వస్తుంది. కొన్నాళ్ళయితే మీ నాన్న మర్చిపోతాడు, ఎంతమందిని చూడలేదు", అన్నాడు. "ఆఖరిగా, నా కోసం, ఒక్కసారి మా నాన్నతో మాట్లాడచ్చు కదా?" అన్నది. "సరే! నీ కోసం ఆఖరి సారి మీ నాన్నతో మాట్లాడతాను. మీ నాన్న కాదు, కూడదు, చస్తాను, చంపుతాను అంటే, నువ్వు వచ్చేయాలి" అన్నాడు. "ఒప్పుకోడని నెగటివ్ గా ఎందుకు ఆలోచిస్తావు? ఒప్పుకుంటాడని నమ్మకం నాకు ఉంది" అన్నది నిషా. సరేనన్నాడు అజయ్.

ఆ తర్వాత వారాంతంలో నిషా వాళ్ళింటికి మళ్ళీ వెళ్ళాడు అజయ్. వాళ్ళ నాన్న అభిప్రాయం రవ్వంత కూడా మారలేదు. "ఉద్యోగం పోయింది కదా! ముందు దాని సంగతి చూసుకో, పెళ్లి గిళ్ళీ తరువాత ఆలొచించచ్చు. ఇంకోసారి నన్ను కలవాలని నీ సమయం వృధాచేసుకోకు" అన్నాడు నిషా

నాన్నగారు. ఉద్యోగం పోయిన సంగతి తనకెలా తెలిసిందా అని ఆశ్చర్యపోయాడు అజయ్. నిరాశతో అక్కడ నుండి వెనుదిరిగాడు.

“మనం పెళ్లి చేసుకుందాము” అన్నాడు అజయ్. “మా నాన్న చూపించిన సంబంధం చేసుకోకపోతే చచ్చిపోతామని బెదిరిస్తున్నారు. నాకు భయమేస్తుంది” అన్నది నిషా. తనని ఒప్పించటానికి చాలా ప్రయత్నించాడు అజయ్. కానీ లాభం లేకపోయింది.

చివరగా ఆ రోజు రానే వచ్చింది. నిషా ఫోను చేసి “మా నాన్న నాకు పెళ్లి ఖాయం చేశాడు, నెలలో పెళ్లి, అబ్బాయి అమెరికాలో పని చేస్తున్నాడు. నేను ఈ పెళ్ళికి ఒప్పుకోక పోయినా, నువ్వు ఈ పెళ్లిని ఆపటానికి ప్రయత్నించినా చచ్చిపోతామని బెదిరిస్తున్నారు. మా అమ్మ, నాన్నలు లేకుండా నేను ఉండను. ఇక ఇదంతా ఇక్కడితో వదిలేయి. నన్ను మర్చిపో. ఇంకెప్పుడూ కలవటానికి కూడా ప్రయత్నించకు” అని చెప్పి, అజయ్ ఏదో మాట్లాడే లోపే ఫోను పెట్టేసింది. అజయ్ కి ఏమి చేయాలో అర్థం కాలేదు. మళ్ళీ తనకి ఫోను చేశాడు. తను స్పందించలేదు. కాసేపటికి ఫోను స్విచ్ ఆపు చేసింది.

అనంతమైన చీకటి అంతటా అలుముకున్నట్టు అజయ్ కి అనిపించింది.ఎక్కడా అవకాశాలు రావటం లేదు,మరొక ప్రక్క నిషా లేదన్న బాధ. ఇలాంటి కష్టాల్లో, కాకరకాయ తిన్నా, ఖర్జూరం తిన్నా పెద్దగా తేడా తెలియదు. ఉదయాన్నే లేవటం, ఉద్యోగం కోసం తిరగటం, ఉసూరుమంటూ సాయంత్రానికి ఇంటికి చేరటం, అజయ్ కి దినచర్య అయిపోయింది. పొరపాటున ఎప్పుడైనా మర్చిపోయినా వెంటనే గుర్తు చేసే జనాలు ఉండనే ఉన్నారు. అసలు భాదలకన్నా సానుభూతి భాదలు ఎక్కువయ్యాయి అజయ్ కి. ఎవరిని కలిసినా “అయ్యో అలా జరిగిందిట కదా పాపం” అని అంటుండటంతో, తనమీద తనే జాలిపడే పరిస్థితికి వచ్చేశాడు.

ఇన్ని కష్టాలతో సతమతమవుతూ, సేద తీరటానికి ఇంటర్నెట్ మీద ఆధారపడ్డాడు. చూసి చూసి యూట్యూబ్ లో వీడియోలు కూడా అయిపోయాయి అనిపించింది అజయ్ కి. ముఖ పుస్తకం చూస్తూ ఓ మహత్తర నక్షత్రాన, అజయ్ చూడకూడని ఫోటోలు చూశాడు. దానితో అప్పటికే రగిలిపోతున్న అజయ్

గుండెల్లో అగ్ని పర్వతం బద్దలయ్యింది. నిషా ,తన భర్తతో ఆనందంగా అమెరికాలో దిగిన ఫోటోలను ముఖ పుస్తకంలో ప్రచురించింది. మన అనుకున్న వాళ్ళు భాధల్లో ఉన్నప్పుడు కన్నా, మనల్ని కాదన్న వాళ్ళు సుఖంగా ఉన్నప్పుడు ఎక్కువ భాధగా ఉంటుంది. వాళ్ళ ప్రేమానురాగాలని ప్రత్యక్షంగా చూసి ప్రాణం పోయినంత పని అయ్యింది అజయ్ కి. ఆ చిత్రాలను లైక్ చేయటం కన్నా లారీ కింద పడి చావటం నయం, కామెంట్ చెయ్యటం కన్నా కత్తితో పొడుచుకుచావటం నయం అనుకున్నాడు.

అంతా కలిసి వస్తుంటే మన గొప్ప అనుకోవటం ,ఏదీ కలిసి రాకుంటే దేవుడిని తిట్టుకోవటం మనకు పరిపాటి. అజయ్ కూడా ఆ బాటలోకే చేరాడు. గుండెల్లో దాచుకోలేనంత బాధ పెరిగిపోతున్నది. అవి కన్నీళ్ళ రూపంలో బయటకు వచ్చాయి. అప్పటికీ తగ్గక బాధ కోపం రూపం దాల్చింది. దానికి చికాకు కూడా కలిసింది. సిగిరెట్లు, మందు తప్ప మంచి నీళ్ళు కూడా తాగటం మానేశాడు. ఎంత వద్దు అనుకున్నా తనని గుర్తుతెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఫలానా విషయం గుర్తుకు రావాలి అంటే గుర్తుండటం కష్టంకానీ మర్చిపోవాలి అంటే మాత్రం మర్చిపోవటం కష్టం. ఏ పనీ చేయటానికి ఉత్సాహం ప్రదర్శించ లేక పోతున్నాడు. ఉద్యోగ ప్రయత్నాలమీద కూడా శ్రద్ధ తగ్గించేశాడు. రెండు పక్షాలు గడిచే సరికి అసహనం అమాంతం ఆకాశానికి తాకేసింది. తన ఆరో ప్రాణం నిషా ,మిగిలిన తన ఐదు ప్రాణాలకు కావాల్సిన ఉద్యోగం రెండూ పోవటంతో, ఆత్మహత్య చేసుకోవాలనే బలమైన బలహీన నిర్ణయానికి వచ్చేశాడు అజయ్.

చావు సాఫ్ట్ వేర్ కోడ్ రాసినంత ఈజీ (సులభం) కాదు, చావటానికి సాఫ్ట్ వేర్ కోడేమి లేదన్న రెండు విషయాలు అజయ్ కి అర్థం కాలేదు. తనకున్న సినిమా పరిజ్ఞానంతో ప్రయత్నాలు మొదలుపెట్టాడు. ఒక అమావాస్య రోజున దక్షణం వైపు తిరిగి, తాను గడ్డం గీసుకునే పెట్టెలో నుంచి ఒక బ్లేడు తీసుకొని, దానితో తన చేతిని కోసుకు చచ్చిపోవాలని నిర్ణయించుకున్నాడు.

చస్తునట్టు ఎవ్వరికీ చెప్పలేదు. చచ్చాక ఎందుకు చచ్చిపోయాడో అందరికీ అర్థం కాకుండా ఉండకూడదని తన చావుకి కారణాలు అన్నీ రాసిపెట్టి చావాలి అని నిర్ణయానికి వచ్చాడు. సాఫ్ట్ వేర్ల

కూడా అసహ్యంగా పేపరు మీద రాసిపెట్టి చావటం ఏంటి? కంప్యూటర్ లో రాసి తన స్నేహితులకు ఈ మెయిల్ పంపి చచ్చిపోవాలనుకున్నాడు. కానీ ఈ టెక్నాలజీనీ అస్సలు నమ్మకూడదు, అయినా కాసేపట్లో చవబోతూ ఇంకా ఈ కంపూటర్లు ఎందుకు అనుకున్నాడు. చివరకు పేపర్ మీదనే రాసిపెట్టి చావాలి అని అనుకున్నాడు. “నాకే కోట్లు ఉంటే వీలునామా రాసి చచ్చేవాడిని. ఆ వీలు లేకుండా పోయింది”. అని మనస్సులో అనుకున్నాడు. “అయినా నా ఆస్తేదో నాకుంది. ఈ ల్యాప్ టాప్ ,నా బండి ఇవన్నీ ఎవరికైనా రాసిపెట్టి పొతే, వీలునామా రాశాను అన్న ఆత్మసంతృప్తితో ఆ అనంత లోకాలని చేరుతాను” అనుకున్నాడు. “కానీ ఎవడికిస్తే ఏం లాభం?” అనుకున్నాడు. చావబోయేవాడికి లాభ నష్టాలతో పనేముందిలే అని అంతలోనే అనుకున్నాడు.

“సరే ఆస్తులు తర్వాత అసలు సంగతి చూద్దాం ,ఆలస్యం అయితే కష్టం అనుకుని, ఒక తెల్ల కాగితం, నల్ల కలం తీసుకొని కూర్చున్నాడు. మొదటి ఆలోచన, “ఈ ఉత్తరం ఎవరికి రాయాలి?” అని. అమ్మా నాన్నలకు, తన బాల్య స్నేహితులకు రాయాలనిపించింది. ఇద్దరికీ చెరోకటి రాయాలా? ఒకటే రాయాలా? అని కాసేపు అలోచించి, చివరకి ఒక్క ఉత్తరంలోనే రాసేయాలని నిర్ణయించుకున్నాడు. “అమ్మా నాన్నలకు, ఆత్మహత్య చేసుకోబోయే అజయ్ వ్రాయునది” అని రాసి ఆపేశాడు. “ఆదిలోనే హంసపాదు, నేను ఆత్మహత్య చేసుకున్న తర్వాత కదా ఈ ఉత్తరం చదివేది, మళ్ళీ ఆత్మహత్య చేసుకోబోయే అజయ్ అని ప్రత్యేకంగా రాయాల్సిన పనేముంది ? చచ్చినోడు ఉత్తరాలు రాయలేడు కదా !” అనుకోని మళ్ళీ దాన్ని మర్చి రాయటం మొదలు పెట్టాడు.

“అమ్మా నాన్నలకు, అజయ్ వ్రాయునది, నా ఉద్యోగం పోయినప్పుడు నేను బాధపడలేదు, ఇంకో ఉద్యోగం వస్తుందిలే అన్న ధైర్యంతో, కానీ నేను ప్రాణంగా ప్రేమించిన నిషా నన్ను కాదని వెళ్ళిపోయినప్పుడు కొంచెం బాధనిపించింది, కానీ తను నన్ను వదిలి సంతోషంగా ఎలా ఉండగలుగుతున్నదో అర్థం కాలేదు. ఉద్యోగం వస్తుందేమో కానీ నిషా తిరిగి రాదన్న బాధ నన్ను ప్రతిక్షణం చంపేస్తున్నది. నిషా రాదన్న విషయం నన్ను నిద్రపోనివ్వటం లేదు. తను లేని ఈ జీవితం

నాకొద్దు, నేను పూర్తిగా ఓడిపోయాను. అందుకే చావాలి అని నిర్ణయానికి వచ్చాను. చస్తున్నాను, క్షమించండి” అని తనకు చేతనైన తెలుగులో రాశాడు.

అంతా రాశాక గుర్తొచ్చింది, తన స్నేహితులకు ఏమీ రాయలేదని. అందుకని, మొదటి వాక్యం లో అమ్మా నాన్నలకు, స్నేహితులకు అని కలిపాడు. ఈ కాగితం ఖచ్చితంగా చదవాలంటే ఎక్కడ ఉంచాలి అని ఆలోచించాడు. చివరకు తన గదిలోని గోడకు ఆ కాగితాన్ని అతికించాడు. ఇక చావటానికి సిద్ధపడ్డాడు. తన కుడి చేతిలో బ్లేడు తీసుకొని, ఎడమ చేతిని ముందుకి చాపి, బ్లేడుతో తన ఎడమ చేతికి, లీలగా కనపడుతున్న నరాలను బ్లేడుతో కోశాడు.

[తరువాయి భాగం వచ్చే వారం]

For Latest Telugu Books - Visit now:
Kinige
.com